



నాకసలే ఆ ఊరు కొత్త. ఇదివరకెప్పుడూ లేదు. బజారంతా రద్దీగా ఉంది. రామకృష్ణా ఐస్ పార్లల్. పద్మావతీ లాడ్జి. వెంకటరమణా ఫాన్సీ అండ్ జనరల్ స్టోర్స్. ఆ పక్కనే బొమ్మనా. ఆడాళ్లూ మగాళ్లూ హడావిడిగా, విడిగా జంటగా మెట్లెక్కుతున్నారు. గాజుతలుపుల వెనకాల తెరవెనకాల తోలుబొమ్మల్లా ఉన్నారు.

గుంపులు గుంపులుగా బుక్కింగుముందు జనం. బెల్లంమీద ఈగల్లా. రోడ్డువార మురికిడ్రైన్ పక్కన మల్లెపూలు. కనకాంబరాలూ, సన్నజాజులూ, మరువం, దవనం అమ్మకం. "ఆంధ్రా షోడా, మిఠాయికిళ్లీ—చిన్నబ్బాయి కిళ్లీషాపు". ఆ పక్కనే మరో దుకాణం. దానిపక్కనే కాఫీ అండ్ భోజనహోటల్ రెండువేపులా చోద్యం చూస్తూ నడుస్తున్నాను. పల్లెటూరు బైతులా. వచ్చింది హైదరాబాదు నుంచే. పల్లెటూరివాడికి నగరం ఎంత వింతగా కనపడుతుందో సువిశాల మహాఇరుకు (అ)భాగ్యనగరం ముందు ఇంత చిన్న టౌను నాకు అంత వింతగానూ కనపడుతోంది.

నా ఎదురుగా ఒక వ్యక్తి నిలుచున్నాడు. సన్నగా బక్కచిక్కిన శరీరం. పెదాల్లో కళ్లల్లో చురుకు. నిశితంగా కళ్లల్లోకి దూరే చూపులు. నవ్వుతున్నాడు. ఎవరు? నేనెరుగనే. ఇంతముందెప్పుడూ చూడలేదే. ఆశ్చర్యం— తేరుకోకముందే. దగ్గరగావచ్చి 'గంజాయి కావాలా' అని అడిగాడు. చేతిలో పిసిండ్రీల్లాంటి, చిన్నసిగరెట్లులాంటివి నాలుగున్నాయి. నేను ఉలిక్కిపడ్డాను ఏంనాలో తోచలేదు. నాకసలే ఇటువంటి విషయాలు పడవు. కోపం వచ్చింది. ఒక్కసారిగా వావిలాల వారది, మల్లాది సుబ్బమ్మగారిదీ, దూబగుంట వాసుల ఆవేశం ఉవ్వెత్తుగా నాలో ప్రవేశించింది. నాకు దారినపోయే వన్నీ నెత్తిన వేసుకోవడం అలవాటు. చైతన్యవంతుడు. బాధ్యతాయుతమైన పౌరుడు ఏం చెయ్యాలి? నాలాంటివాడే కళ్లుమూసుకుంటే ప్రజాస్వామ్యం ఎలా మనగలుగుతుంది. కూలికి అమ్ముకునేవాణ్ణి పోలీసులకు పట్టిస్తే మాత్రం ఒరిగేదేమిటి? అయినా ట్రాఫిక్ పోలీసు నడిబజార్లో ఉండగానే బహిరంగంగా అమ్ముతుంటే నేను ఏం చెయ్యాలి? నేను ఎక్సైజ్ ఇనస్పెక్టరునైనా ఐతే ఎంత బాగుండును?

పై ఆలోచనలన్నీ ఒక్కుమ్మడిగా వచ్చివెళ్లిపోయాయి.

"ఎంత?" అన్నాను.

"నాలుగూ వంద రూపాయలు. అలాపక్కకు రండి. ఇక్కడకాదు" అంటూ పక్కనే రెండు భవనాలమధ్య ఉక్కిరిబిక్కిరౌతున్న సందులోకి దారితీశాడు.

నేనూ వెళ్లాను. రెండు పందులు రోడ్డుపై పొర్లిన డ్రైనేజీనీటిలో పొర్లాడే ప్రయత్నం చేస్తున్నాయి. ఒక కుక్క ఒకేఒక విస్తరాకును ఆబగా నాకుతోంది.

"ఇల్లా ఇవ్వండి వంద"

జేబులోంచి నోటు తీసి ఇచ్చాను.

వాడు జేబులో పెట్టుకున్నాడు.

"రేపు కావలిస్తే మళ్లీ రండి ఈ ప్రాంతాల్లోనే తిరుగుతూంటాను" అన్నాడు.

"సరుకు మంచిది మజాగా ఉంటుంది"

గంజాయి సిగరెట్లను జేబులో పెట్టుకున్నాను.

ట్రాఫిక్‌పోలీసు దగ్గరకు వెళ్లాను.

"పోలీసుస్టేషను ఎక్కడా?"

"ఎందుకు?"

"పనుంది"

"ఇలా తిన్నగావెళ్లండి. జంక్షన్ వస్తుంది. కుడివైపు తిరగండి. స్టేటు బేంకు వస్తుంది. దానిపక్కనే ఉంది. మా సి.ఐ. గారు మీకు బంధువా?"

అప్రయత్నంగా తలాడించాను.

ట్రాఫిక్ పోలీసు నమస్కారం చేశాడు.

చెప్పిన గుర్తుల ప్రకారం నడిచి పోలీసుస్టేషనుకు వెళ్లాను. కథల్లో చెప్పినట్టుగానే అరుగుమీదున్న బెంచీమీద సెంట్రీ కునికిపాట్లు పడుతున్నాడు. ఓ టేబులు వెనకాల కుర్చీల్లో రైటరు నాటకాల్లో లాగే ఏవో కాగితాల మీద చకచకా బరి

కేస్తున్నాడు. పగలు కావడం మూలాన గుడ్డిదీపం ఏం మాత్రం వెలగడంలేదు. ఫవర్‌కట్ మూలాన లోపలంతా అంధకరంగా ఉంది. భారతదేశ భవిష్యత్తులా. రైటరు టేబులు ముందు, ఇద్దరు, నా కంటే పల్లెటూరువాళ్లు కాబోలు, నేరస్థుల్లా చేతులు కట్టుకుని నుంచున్నారు. వీళ్లను దాటుకుంటూ నేను గుమ్మానికున్న తెర తొలగించుకుని లోపలకెళ్లబోతుంటే మరో పోలీసు అడ్డుకున్నాడు.

"ఎవరు కావాలి?"

"ఇనస్పెక్టరు గారిని కిలవాలి"

"ఎందుకు?"

"పనుంది"

"మాతో చెప్పండి"

"ఆయనతో స్వయంగా కలిసి మాట్లాడాలి"

"అయ్యగార్లేరు. లంచికెళ్లారు.

మూడు గంటలకు వస్తారు...

ఇంతకీ మీ కంప్లైంటు ఏమిటి?"

"ఆ అయనతోటే చెప్తాను"

"కాయితంమీద రాసివ్వండి. మేం ఆయనకిస్తాం. ఆయనొచ్చినా అంతే చెప్తారు. ఇంతకీ మీ పర్సు పోయిందా?"

"కాదు"

"మరేవిటి చెప్పండి?"

"ఆయన్తోనే చెప్పాలి"

"ఈ చదువుకున్నోళ్లతో ఇదేతంటా. మా డిపార్టుమెంట్లో అందరు ఒకటే. ఎవరైనా కంప్లైంటు తీసుకోవచ్చు. ఎఫ్ఐఆర్ రాసి కేసు రిజిస్టరు చేస్తారు. ఆ మాత్రం తెలీదా?" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"సంగతేమిటో చెప్పండి' రెట్టించాడు.

నా లెవలుకు కానిస్టేబులు సరిపోడనిపించింది.

అయినా మానవులందరూ ఒకటేఅని నేర్చుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది. కానిస్టేబులు స్థాయిని కించపరచడం కుసంస్కారంగా కనిపించింది.

రైటరు, కథల్లో లాగానే ముక్కుమీద జారిపోయే కళ్లజోడు సవరించుకున్నాడు. ఎగాదిగా నాకేసి చూశాడు.

"ఏంకావాలి మాస్టారూ?" అన్నాడు రాస్తున్న కాయితాలు మడిచి పక్కనపెట్టి.

ముందు నిల్చున్నవాళ్లు తమ భవిష్యత్తు ముడుచుకుపోయినట్టు భావించారేమో మరింత ముడుచుకుపోయారు.

రైటరు పోలీసు డ్రెస్సులో లేడు. నాటకాల్లోలా పంచె లాల్చీ వేసుకున్నాడు. భుజం మీద కండువాకూడా ఉంది. పెద్దమనిషిలాగే ఉన్నాడు.

జేబులోంచి గంజాయి సిగరెట్లు తీసి చూపించాను ఇవేమిటి?

ఆవేశాన్ని వీలైనంత అణగదొక్కి

"గంజాయి సిగరెట్లండీ. నడిబజార్లో బహిరంగంగా అమ్ముతుంటే కొన్నాను. మీ డిపార్టుమెంటు ఏం చేస్తోంది?" అన్నాను.

రైటరుకు బట్టతలలేదు. జుట్టు నెరవలేదు. కథల్లోలా. కాని తలపండిన వాడిలా. తాపీగా అన్నాడు.

"గంజాయి సిగరెట్లా? ఇక్కడి కెందుకు వచ్చారు? ఎక్సైజు కేసులు మేం రిజిస్టరు చెయ్యం.డిపార్టుమెంటు ద్వారా రావాలి.

"అవతల ఘోరాలు జరుగుతుంటే రూల్సు ప్రొసీజర్లూ అంటారేమిటి. మీ ఎస్సైగా రెప్పుడొస్తారు?"

రైటరు మరింతతాపీగా అన్నాడు.

"గంజాయి అమ్మడం ఎంతనేరమో కొనడం కూడా అంతే నేరం? మీరెందుక్కొన్నారు?"

ఈ పాయింటు నాకు తట్టలేదు.

పెద్దాయనగారు కాబోలు "బుద్ధి జాడ్య జనితోన్మాదుల్కదా శ్రోత్రియుల్" అన్నాడు.

నాక్కాళ్ళూ చేతులూ వణికాయి. ముచ్చెమటలు పోశాయి. జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాను. రైటరు నా పరిస్థితి గమనించాడు. పోలీసుల్లో కూడా తెలివైన వాళ్ళుంటారనిపించింది. వేశ్యల్లో కూడా నిజాయితీగా ఉండే మధురవాణి లాంటి వాళ్ళూ.

అమ్మింది వాడెవడో అయితే మీకు చెమట్లు పోస్తున్నాయేమిటి సార్. ఇలాకూర్చోండి" అని పక్కనున్న కూర్చీ చూపించాడు.

తరవాతనే నిచ్చిన గంజాయి సిగరెట్లు లోంచి ఒకదాన్ని తీసుకుని ఒకచిన్న కాయితం చింపి సిగరెట్టులోని గంజాయి ని జాగ్రత్తగా దానిపై విప్పిపోశాడు. నల్లటి బొగ్గులాంటి పొడెం నాలుగైదు బిటికెలుంది. అదిపడింది. చార్మినార్ దగ్గర ముత్యాల వర్తకుడిలా దాన్ని వేళ్ళతో సున్నితంగా తడిమాడు. నాకేసి ఓసారి ఎగాదిగా చూశాడు.

"మీరెప్పుడన్నా గంజాయి ఎలా ఉంటుందో చూశారా మాస్టారూ. ఇది పనికిరాని బొగ్గుపొడి ఎవడో మీకు టోపీ వేశాడు. ఏ ఊరు మనది ?ఎంత ఇచ్చారు దీనికి?"

"వంద రూపాయలు" చెప్పడానికి బిక్కచచ్చిపోయాను.

"అన్నీ మీకే తెలుసుననుకోకండి సార్ చదువుకున్న వారిలానూ, మర్యాదస్తుల్లా కనపడుతున్నారు. సమయానికి ఎస్సైగారు లేరు కాబట్టి సరిపోయింది. లేకపోతే లాకప్పు లోకి మీరే వెళ్ళిపోయేవారు.

నండూరివారు చెప్పినట్టు గుండెగొంతుకలోనే కొట్లాడినట్లుంది.

స్టేషనులోంచి రోడ్డు మీదకు ఎలా వచ్చానో నాకేతెలీదు.

★★★

రిక్షా దిగి హోటలు రూముకి వచ్చాను. కౌంటర్లో తాళం చెవితీసుకున్నాను. వరండాలో వెడుతూంటే నూటపదకొండో రూం తలుపులు ఓరగా తెరచి ఉన్నాయి. అందులో ముగ్గురమ్మాయిలున్నారు. మూడ్రోజులుగా సాయంకాలాలు వాళ్ళు కనపడతున్నారు. అప్పుడప్పుడూ ఎవరో అబ్బాయి లు కూడా ఉంటున్నారు. ఒకామె మంచం మీదపడుకుని చూస్తోంది. ఇద్దరు గుమ్మం ముందర నవ్వుతూ మాట్లాడుతున్నారు. దూరం గా రైటరు నిలబడి ఉన్నాడు. మూడు రోజుల్నించీ చూస్తున్నాను వాళ్ళిక్కడ ఎందుకున్నారు? ఇది పరువూ మర్యాదా గలహోటలు కాదేమో? అయినా పెళ్ళి చేసుకుని కాపురం చేసే వయసున్న వీళ్ళకిదేంపోయేకాలం. ఎయిడ్స్ వస్తే వీళ్ళకు.

నాకక్కర్లేని విషయాలు గురించి ఆలోచించడం జాడ్యమైపోయింది. కొద్ది గంటలక్రితం జరిగిన శృంగభంగం చాల్లేదా. లెంపలేసుకున్నాను.

హడావిడిగా రూములో కెళ్ళిస్నానంచేశాను. బట్టలు సర్దుకున్నాను. వాచీ చూశాను. 8.00 రైలుస్టేషను జేరాను. గోదావరి ఎక్స్‌ప్రెస్సు అనుకున్న టైముకే వచ్చింది. రైలు లేటవ్వలేదేమిటి? సవ్యంగా జరిగినా అనుమానమే.

నా సీటు బెర్తు చూసుకుని బట్టలు మార్చుకుని పడుకునేందుకు ఉపక్రమించాను. జేబులో ఏదో తగిలింది అదేగంజాయి సిగరెట్టు. బొగ్గు సిగరెట్టా? ఎందుకైనా మంచిదని భద్రంగా దాచాను.

తెల్లారేక సికింద్రాబాదు స్టేషనులో లగేజీతో దిగడానికి గుమ్మం ముందు నిల్చున్నాను. పోర్టర్లు సైంధవుళ్ళా అడ్డు తగిలారు. వాళ్ళను తప్పించుకుని హడావుడిగా ఆటోక్యూలో చేరాను. నా పక్కకు ఒక మనిషి వచ్చి లగేజి చెక్ చెయ్యాలన్నాడు. ఎక్సైజు మనిషిట. తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

అయ్యా నేను కాఫీ కూడా తగను. నన్ను నమ్మండి అన్నావినలేదు"

"మా డ్యూటీ మేం చెయ్యాలి గద" అన్నాడు.

"ఆ మాటానిజమే"

సూటుకేసు విప్పాడు తాళం నాచేత తీయించాడనుకోండి. బట్టలు, పుస్తకాలు ఇంకేముంటాయి నా దగ్గర.

లోపలున్న చిన్న అరలో చెయ్యి పెట్టాడు. వాడి చేతికేదో తగిలింది. బైటకు తీశాడు నిన్న నేను భద్రంగా దాచిన గంజాయి (బొగ్గు?) సిగరెట్టు "ఇదేమిటి-మాస్టారూ?"

అవాక్కయ్యాను

సిగరెట్టు ఒక పక్కన చిన్నగా గిల్లాడు. సన్నటి తెల్లని బూడిదలాంటి పొడెం చేతిలో పడింది.

బ్రౌన్‌షుగర్ మీకెక్కడినుంచి వచ్చింది?

పైగా కాఫీ కూడాతాగనంటారా?" అని గదమాయించాడు.

సార్ నన్ను నమ్మండి నాకేం తెలీదు"

పక్కకు నడవండి మీ స్టేటుమెంటురికార్డు చేసుకోవాలి" అని దూరాన ఉన్న మరో ఎక్సైజు కానిస్టేబుల్ని పిలిచి నన్నప్పగించాడు.

ప్రయాణికులందరూ నాకేసిచూస్తుంటే అవమాన భారంతో నా సూట్‌కేసు తో ఆకానిస్టేబులు వెనకాల నడిచాను.

●